క్లుప్తంగా

జెడ్పీటీసీ ప్రతాప్‌కు అభినందనలు



ముసునూరు: వైఎస్సార్ సీపీ ఏపీ స్టేట్ ఉపాధ్యాయ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీగా నియమితులైన ముసునూరు జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్‌ను యాదవ యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. లోపూడిలో సర్పంచ్ పేరం కృష్ణ అధ్యక్షతన సోమవారం పౌర సన్మానం నిర్వహించారు. మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, విద్యావేత్తలు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.రాజానాయన, మాజీ సర్పంచ్ పేరం మద్దిరామయ్య, మాజీ ఎంపీటీసీ చిన్ని వెంకటాచలం, మాజీ ఉపసర్పంచ్ లక్కపాము తిరుపతయ్య, యాదవ యూత్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు అంధకారం

జూపూడి(ఇబ్రహీంపట్నం): విద్యార్థులు మాదక ద్రవ్యాల మత్తులో పడి జీవితాలు అంధకారం చేసుకోవద్దని జిల్లా ఈగల్ టీమ్ సీఐ ఎం.రవీంద్ర సూచించారు. జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా ఈగల్ టీమ్, నవజీవన్ బాలభారతి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణ సదస్సును సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులు సీఐ ఎం.రవీంద్ర, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్ మాట్లాడుతూ.. గంజాయి, కొకైన్ బ్రెస్, హెరాయిన్ వంటి మత్తు మందులకు కొందరు యువకులు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి డ్రగ్స్ వాడమని ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐలు రాంబాబు, ఎం.వీరాంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్ ఖాన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బుడమేరుకు స్వల్పంగా వరద



జి.కొండూరు: ఎగువ ప్రాంతాలైన ఏ.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురవడంతో పలు వాగులు పొంగిపొర్లాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం నుంచి బుడమేరుకు స్వల్ప వరద ప్రవాహం కొనసాగుతోంది. జి.కొండూరు మండల పరిధి వెలగలేరు శివారులో బుడమేరుపై ఉన్న హెడ్ రెగ్యులేటర్ వద్ద 2.9అడుగుల మేర వరద ప్రవాహం చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం హెడ్ రెగ్యులేటర్ నుంచి బుడమేరు డైవర్షన్ కెనాల ద్వారా 1500 క్యూసెక్కుల మేర కృష్ణానదిలో కలుస్తోంది. మండల పరిధి హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్యన ఉన్న లోలెవెల్ చప్టాపై ప్రవాహం కొనసాగుతున్న క్రమంలో రాకపోకలను నిలిపివేశారు. పక్కనే ఉన్న హైలెవెల్ వంతెన కూడా శిథిలావస్థకు చేరి ఉండడంతో పాటు వాగులో వరద ఉధృతి ఉన్నందున ఈ వంతెన పై కూడా రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత రాకపోకలను పునఃరుద్ధరిస్తామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు

తిరువూరురూరల్: మండలంలోని అక్కపాలెం, రోలుపడి, సూరవరం గ్రామాల్లో సోమవారం జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమంలో భాగంగా పశువులకు టీకాలు వేశారు. విజయవాడ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సిబ్బంది ఈ శిబిరాల్లో పశువుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. గాలికుంటు వ్యాధి నిరోధానికి పశువులకు తప్పక ఈ టీకాలు వేయించాలని ప్రత్యేకాధికారి తనూజ సూచించారు. శిబిరంలో పశువైద్యాధికారులు శ్వేత, అఖిలాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ అందజేత



ఆగిరిపల్లి: తోటపల్లి గ్రామస్తులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు సోమవారం ఉచిత మంచినీటి ట్యాంకర్‌ను అందజేశారు. ఆయన తండ్రి సీమయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామస్తులకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ట్యాంకర్ అందజేసినట్లు రాంబాబు చెప్పారు. కార్యక్రమంలో బెజవాడ హర్ష, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు లోక్ కల్యాణ్ మేళా

నూజివీడు: పట్టణంలోని షాదీఖానాలో ఈనెల 24న లోక్ కల్యాణ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి సోమవారం తెలిపారు. వీధి వ్యాపారులకు రుణ సదుపాయం, డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంతేకాకుండా వీధి వ్యాపారుల్లో రుణాలు కావాల్సిన వారి వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- తొలి రోజు శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనం
- అమ్మవార్లకు విశేష పూజలు
- ఆలయాల్లో భక్తుల కోలాహలం

తిరువూరు: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల వ్యాప్తంగా శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మవార్లు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. తిరువూరు పట్టణంలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయం, శ్రీసంతోషిమాత ఆలయం, శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, శ్రీ రంగనాయక స్వామి దేవస్థానం, సత్యసాయి మందిరం, శ్రీకనక దుర్గాలయాల్లో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజాదికాలు జరిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు శ్రీకోదండ రామాలయం, గంపలగూడెం రామాలయం వీధిలోని నవరాత్రి ఉత్సవ పందిరిలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మీదేవిని ఆదిలక్ష్మిగా అలంకరించి ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, భక్తులు పూజలు నిర్వహించారు. ఏ.కొండూరు మండలం గోపాలపురం సాయిమందిరంలో స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

విస్సన్నపేట: స్థానిక కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంలో మాజీ సర్పంచ్ కుక్కడపు ప్రసాదరావు, గంధం సత్యహనుమంతరావు దంపతులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని పుట్రేల గ్రామంలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ జి.రామకృష్ణ దంపతులు అమ్మవారి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో పందిళ్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ముందుగా అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఫెర్రీ వద్ద కృష్ణానదికి ఊరేగింపులతో తీసుకొచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక పవిత్ర సంగమం ఏర్పాటు చేసిన చలువ పందిరిలో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, రాధ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఫెర్రీలో భారీ ఊరేగింపుతో అమ్మవారి ప్రతిమను పవిత్ర సంగమం వద్దకు చేర్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్ వార్డు కౌన్సిలర్‌లు, స్థానికులు పాల్గొన్నారు. సాయంత్రం విజయనర్తనం కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేలు వసంత వెంకటకృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. 6 గంటలకు ప్రారంభం కావల్సిన ఉత్సవాలు 8 గంటలకు ప్రారంభం కావడంతో అనేక మంది ప్రజలు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. ముందుగా అమ్మవారి విగ్రహానికి పూజలు నిర్వహించారు.



ఈదులగూడెంలో..

కోటమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో



నూజివీడులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నూజివీడు: దసరా ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే 69వ శ్రీ దేవీ శరన్నవరాత్రులు పట్టణంలోని శ్రీ కోటమహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు శ్రీ బాల త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో వై.అలివేణి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే పాతపేట జ్ఞానసరస్వతీదేవాలయం, జంక్షన్‌రోడ్‌లోని జ్ఞానసరస్వతీదేవాలయం, 32వ వార్డులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలలో నవరాత్రి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. పాతపేటలోని జ్ఞానసరస్వతీదేవాలయంలో, జంక్షన్‌రోడ్‌లోని జ్ఞాన సరస్వతీదేవికి, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కోనేరుపేటలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైలవరం: స్థానిక టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ కార్యాలయం సమీపంలో పందిట్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కోట వెనుక కోట మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద అమ్మవారిని శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

చాట్రాయి: దేవీ నవరాత్రుల సందర్భంగా సోమవారం కనకదుర్గ అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేశారు.

బలివే(ముసునూరు): బలివేలోని చారిత్రక ప్రసిద్ధ రామలింగేశ్వ స్వామి ఆలయానికి, ఉప ఆలయంలో కొలువై ఉన్న రాజ రాజేశ్వరి అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. చింతలవల్లి, చెక్కపల్లి, గుడిపాడు శివాలయాల్లోనూ, ముసునూరు తూర్పు, పడమటి రామాలయాల్లో, చెక్కపల్లి, లోపూడి, రమణక్కపేట శ్రీకోదండ రామాలయాల్లో, అమ్మవారికి మహిళలు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చాట్రాయిలో పూజలు చేస్తున్న నిర్వాహకులు



మైలవరంలో..

ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద కొలువై ఉన్న దుర్గమ్మ తల్లి బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చారు. రజక వీధిలో, దమ్మన్న మండపంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నూజివీడు నియోజవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య ఈదులగూడెంలో ప్రత్యేక పూజలు చేశారు. రేణుకా క్షేత్రంలో భక్తులు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



గంపలగూడెంలో బాలాత్రిపురసుందరీదేవి



తిరువూరు సత్యసాయి మందిరంలో..



బలివేలో బాలాత్రిపుర సుందరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు



పవిత్ర సంగమం వద్ద కూచిపూడి నృత్యం చేస్తున్న చిన్నారులు

కార్మికుల పని గంటలు పెంచడం దుర్మార్గం

నూజివీడు: పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల మెప్పు కోసం చంద్రబాబు ఇలాంటి కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తీసుకున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి షరతులు లేకుండా వాహన మిత్ర అమలు చేయాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు నండూరి రామ హనుమాన్లు, శోభనాద్రి, ప్రభాకర్, రంగారావు, ప్రసాద్, రామారావు, రాజు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్మికులు

కొండపల్లిలో నిరసన..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల వేతనాలు పెంచకుండా పని గంటలు పెంచిన కూటమి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా కొండపల్లి ఐడీఏలో కార్మికులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ అసెంబ్లీ వేదికగా రోజుకు 8 గంటల పని వేళలను మార్పు చేసి 12 గంటలు పని చేయించుకోవచ్చని చట్టం చేయడం దుర్మార్గమన్నారు. కార్మికుల పనివేళల చట్ట సవరణ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ చట్టం గడిచిన 15 ఏళ్లుగా సవరణకు నోచుకోలేదన్నారు. ఇప్పటికే పెరిగిన పనిభారంతో చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌పీ గ్యాస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, డ్రైవర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పని గంటలు పెంచుతూ చేసిన చట్టాలు ఉపసంహరించాలి

మైలవరం: పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాలను ఉపసంహరించాలని సీఐటీయూ మైలవరం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంపుకు వ్యతిరేకంగా సోమవారం మైలవరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు మైలవరం మండలం కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అసెంబ్లీలో చట్టాలను వెనక్కి తీసుకోకుంటే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధమవుతామన్నారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జ్యోతి, ఆర్ఆర్‌వీ పుష్పకుమారి, సీహెచ్ శారద, కె.సరోజినీ, ఉష, పద్మ, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతులు కల్పించాలని ధర్నా

నూజివీడు: గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మించిన జగనన్న కాలనీల పట్ల కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ ధ్వజమెత్తారు. పట్టణ పరిధిలోని జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కాలనీ వాసులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల్లో పేదలు గృహాలు నిర్మించుకుంటే వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. పట్టణంలో అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న పేదలు అప్పు చేసి మరీ గృహాలు నిర్మించుకుంటే ఆ పేదల కాలనీలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సరైన రోడ్లు లేక, రాత్రిపూట వీధి లైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్నకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మడుపల్లి నాగేంద్రరావు, చెంగల వెంకటేశ్వరావు, ఆకునూరి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.




సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీ వాసులు, నాయకులు

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి


సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలను గడువులోగా పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 53 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఏడీఏ జీ విద్యాసాగర్, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగలక్ష్మి, డీఎల్‌డీఓ వెంకటరత్నం, సీడీపీఓ పిల్లి విజయలక్ష్మి, హౌసింగ్ ఈఈ రామోజీ నాయక్ పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న

యోగా అధ్యాపకుడికి లైఫ్ టైం ఎచీవ్‌మెంట్ అవార్డు



నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో యోగా అధ్యాపకుడిగా పని చేస్తున్న పగడాల చంద్రశేఖర్‌కు లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డు లభించింది. బెంగళూరుకు చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ బెంగళూరు కల్యాణ్, అమెరికా యోగా యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డును ఇటీవల అందజేశారు. గత 20 ఏళ్లుగా యోగా అభివృద్ధికి అంకితభావంతో చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కిందని ఈ సందర్భంగా చంద్రశేఖర్ పేర్కొన్నారు. చంద్రశేఖర్‌ను సోమవారం ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ సాదు చిరంజీవి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సుబ్బలక్ష్మి, పీఆర్వో జడ సుబ్బారావు అభినందించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పది మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ పేరుతో(పీపీపీ) ద్వారా ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయటాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రభుత్వం తమ బాధ్యతను వదిలేసి ఆర్థిక కారణాలను సాకుగా చూపి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటం సమంజసం కాదన్నారు. తాము అధికారంలోకి వస్తే 107, 108 జీవోలను రద్దు చేస్తామని చెప్పిన చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ నేడు వంద శాతం కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై ప్రజలు ముక్తకంఠంతో గొంతెత్తాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించటం ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పోడవటమేనని, వైద్య కళాశాలలను న్యాయపోరాటం ద్వారానైనా అడ్డుకుంటామని హరినాథ్ స్పష్టం చేశారు.

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: ప్రధానమంత్రి చేపట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ముచ్చినపల్లి గ్రామ సర్పంచ్ దేవళ్ల జమలయ్య తెలిపారు. ముచ్చినపల్లి గ్రామ సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సోమవారం జరిగింది. 72 మంది మహిళలకు, ఇద్దరు పురుషులకు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కీర్తి, ఆరోగ్య సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాంసుందరరావు, ఎంఎల్‌హెచ్‌పీలు భవ్య, దివ్య, కమల కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు. ముచ్చినపల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు పోషణ అభియాన్ స్టాల్ ఏర్పాటు చేశారు.


నూజివీడు: మండలంలోని దేవరగుంటలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సోమవారం గొల్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా వైద్య సిబ్బంది, గ్రామస్తులు కలిసి గ్రామంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచి పల్నాటి అనూష, గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ గౌతమ్ మాట్లాడుతూ.. ప్రతి మహిళా క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నక్కా గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



ముచ్చినపల్లిలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తి

చాట్రాయి: చనుబండ సచివాలయం 1లో సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పథకం కింద వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాదు శిబిరంలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, సొసైటీ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పోలవరంలో వైద్య శిబిరాన్ని వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది నిర్వహించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఆందోళన



విస్సన్నపేట: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకుడు వి.నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని కోరుతూ ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతుగా విస్సన్నపేటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్‌హిట్ అని గొప్పలు చెప్పుకుంటుంది తప్ప బకాయిలు గురించి మాట్లాడటం లేదన్నారు. రాష్ట్ర విద్యాశాఖమంత్రి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి హిట్ అని చెప్పాలని ఎస్ఎఫ్ఐ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు శ్రీను, రాము, రైతు సంఘం నాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.